# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజధాని కోసం భూములిచ్చిన ఏ రైతుకూ అన్యాయం జరగనీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ తీర ప్రాంతంలో కోత నివారణకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ శివారు ప్రాంతపు ఆయికట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.
- ❖ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

============================

ప్రపంచంలోనే అతిపెద్ద భూ సేకరణ ప్రాజెక్టు అమరావతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు ఆయన అమరావతిలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 29 వేల మంది రైతులు 34 వేల 400 ఎకరాల భూమిని రాజధాని కోసం ఇచ్చారని, దానికి సంబంధించి పదేళ్ళ వరకు పరిహారం ఇస్తామని రైతులకు చెప్పామన్నారు. రైతులు ఇచ్చిన భూమితో పాటు ప్రభుత్వ భూమి కలిపి మొత్తం 53 వేల 745 ఎకరాలు సమకూరిందని తెలిపారు. రాజధాని కోసం అమరావతిలో భూమి ఇచ్చిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనీయమని స్పష్టం చేస్తూ....

(వాయిస్ 37 సెకన్లు)

============================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాలను సందర్శించారు. మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ, రెవెన్యూ అధికారులతో చర్చించి, సముద్రపు కోతకు గల

కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంలో భూమి సముద్రంలో కలిసిపోయిందని స్థానిక సర్వేయర్ తెలిపారు. యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామంలో పర్యటించిన ఆయన.. సురక్షిత మంచినీ ట్యాంకును, సూరప్ప చెరువును పరిశీలించారు. మండల పరిధిలోని 8 తీర ప్రాంత గ్రామాల్లో 1,360 ఎకరాలు కోతకు గురైందని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కోత నివారణకు అనుసరించవలసిన మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ఈ అంశంలో ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఈరోజు తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం, పుష్కర పంపింగ్ స్కీమ్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతాంగానికి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... శివారు ప్రాంతపు ఆయికట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 60 వేల ఎకరాలకు, పుష్కర ఎత్తిపోతల పథకం నుండి ఒక లక్ష 40 వేల ఎకరాలకు సాగునీటి కాలువల ద్వారా నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్య ప్రభ, కలెక్టర్ పి. ప్రశాంతి పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటి సరఫరాకి అధిక ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన సీజనల్ వ్యాధులపై సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాలు, పట్టణాల్లో కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపం, దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రత్యేకించి గిరిజన ప్రాంత ప్రజల్లో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతున్నాయని, ఈ అంశంపై వైద్య, ఆరోగ్య శాఖ మరింతగా దృష్టి సారించాలని సూచించారు. సమీక్షలో భాగంగా.. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు కార్యాచరణ అమలు చేస్తున్నామని, జ్వర సంబంధిత కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తీవ్రమైన కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించామని వివరించారు. కాగా.. గతంలో అమలు చేసిన నీటి ట్యాంకులను శుభ్రపరచడం, క్లోరినేషన్ వంటి ఉత్తమ విధానాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరేందుకు పాఠశాల విద్య పునాదినిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు ఆయన తూర్పు గోదావరి జిల్లా సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పాఠశాల దశలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. బాలికలకు ప్రత్యేకమైన పాఠశాలల్ని ఏర్పాటు చేస్తున్నామని, బాలికల బంగారు భవిష్యత్తుకు విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని నూతన కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. ఈరోజు ఆయన కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పర్యాటకంగా గుర్తింపు పొందిన విశాఖ ప్రాంతానికి మరింత గుర్తింపును తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. పట్టణ ప్రాంత ప్రధాన సమస్యల పరిష్కారంపై

దృష్టి సారిస్తానని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. వైద్యపరమైన సేవలను జిల్లాలో మరింత విస్తృతం చేస్తామని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలియజేస్తూ....

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ పరిరక్షణ చర్యలు మన ఇంటి నుంచి, పనిచేసే ప్రదేశం నుంచే ప్రారంభం కావాలని విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ అంగముత్తు అన్నారు. పోర్టు ఆవరణలో ఈరోజు జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. విశాఖ పోర్టు తన భాగస్వామ్య సంస్థలతో కలిసి, నగరంలో 10 లక్షలు మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులకు కొన్ని అనుమతులు రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే మొదలుపెట్టి నిర్దేశిత గడువులో పూర్తి చేస్తామని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "ఏక్ పేడ్ ... మా కే నామ్" ప్రత్యేక ప్రచారంలో భాగంగా ఈరోజు ఆయన ఢిల్లీలో ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'అమ్మ పేరుతో ఒక మొక్క'... 'ఏక్ పేడ్ మా కే నామ్' నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవరచుకొని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మొక్కలు నాటడమనే ఒక చిన్న చర్య, వాతావరణ మార్పులతో పోరాడి, కాలుష్యాన్ని తగ్గించి... పరిసరాలను పచ్చగా మార్చడానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, సామాజిక మాధ్యమాల్లో మొక్కల్ని నాటే తమ అనుభవాలను పంచుకోవడం ఒక ఉద్యమంగా మార్చాలని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమో కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఈరోజు ఆయన చౌడేపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్, సదుంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల్ని సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... త్వరితగతిన ఉపాధి అవకాశాలు పొందేందుకు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులు తోడ్పడతాయన్నారు. వ్యవసాయ, పశు ఆధారిత రంగాలపై ఆసక్తి కలిగిన వారంతా ఈ కోర్సులను పూర్తి చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అటల్ ఇన్నోవేషన్ మిషన్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ కె. కార్తీక్ ఆకాంక్షించారు. ఈరోజు జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల నూతన అభ్యాస విధానాల కోసం 2016 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. దీని కోసం జిల్లాలో 42 పాఠశాలల్ని ఎంపిక చేశామని, 6 నుంచి 12వ తరగతి వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సంయుక్త కలెక్టర్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

"ప్రపంచ జూనోసిస్ దినోత్సవం" సందర్భంగా ఈ నెల 6వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా శునకాలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నామని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల్లో వేసేందుకు 5 లక్షల 70 వేల యాంటీ రేబీస్ టీకాలు సిద్ధం చేశామని

తెలిపారు. పశుపక్ష్యాదులతో మెలిగే వారికి రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసుల్లోసిస్, క్షయ వంటి వ్యాధులు వచ్చే అవకాశముందని, ఈ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడమే "ప్రపంచ జూనోసిస్ దినోత్సవం" ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =